క్లుప్తంగా

వీధి దీపాలు ఏర్పాటు


వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

నారాయణవనం: సముదాయం గ్రామంలో మాడి పోయి నెలల తరబడి వెలగని వీధి దీపాల స్థానంలో సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి ఎల్ఈడీ దీపాలను గురువారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు, గాలులకు షార్ట్ సర్క్యూట్‌తో 20 వీధి దీపాలు కాలిపోయాయని తెలిపారు. రాత్రుల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి, కొత్త ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయించానన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ తహసీల్దారు భార్గవి ఆదేశాలతో వీఆర్ఓలు భాస్కర్ గురువారం పట్టుకుని, తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ పనులు, ఇంటి అవసరాల కోసం ఏఈఈల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న శివరామకృష్ణ

శ్రీకాళహస్తి: ప్రభుత్వం చెప్పిన ఐటీ, జీఎస్టీ నిబంధనలు తప్పక పాటించాలని తిరుపతి జిల్లా ఆదాయపు శాఖ అధికారి శివరామకృష్ణ అన్నారు. పట్టణంలో గురువారం ఉద్యోగులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను రిటర్నులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సూర్య బాబునాయక్, ఆడిటర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా సాయం


చెక్కును అందజేస్తున్న సుబ్రమణ్యంరెడ్డి

నారాయణవనం: సముదాయం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలను గురువారం అందజేశారు. క్యాన్సర్‌తో ఆరోగ్యం క్షీణించి వలంటీర్ లోకేష్ మృతి చెందాడు. అలాగే గతవారం అనారోగ్యంతో వరలక్ష్మి మృతి చెందింది. వీరి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు చొప్పున సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ద్రాక్షాయణి, మహిళా పోలీసు హిందుమతి గురువారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు.

శంకరంబాడికి పుష్పాంజలి


పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో గురువారం రాష్ట్ర గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి ఘనంగా జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు యువశ్రీమురళి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చారిత్రక సాంస్కృతిక వారసత్వాన్ని మా తెలుగుతల్లికి మల్లె పూదండ గీతాన్ని రమ్యంగా రచించి, రాష్ట్ర ప్రశస్తిని అందించిన ఘనత శంకరంబాడి సుందరాచారికి దక్కిందన్నారు. అనంతరం శంకరంబాడి సుందరాచారి సాహితి ప్రస్థానం గురించి పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కేవీబీపురం: గత శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కేవీబీపురం ఎస్ఐ సునీల్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ఆరె బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన సురేష్(34) గత శుక్రవారం మలుపు దాటుతుండగా బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముగిసిన ఆడికృత్తిక తెప్పోత్సవాలు

- సాయంత్రం తెప్పోత్సవం, రాత్రి గ్రామోత్సవం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో ఆడికృత్తిక తెప్పోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. శ్రీ ముత్తుకుమార స్వామి ఆలయంలో ఆడికృత్తిక తెప్పోత్సవాల్లో భాగంగా చివరిరోజున రామగిరి కొండపై వెలసిన శ్రీసుబ్రమణ్య స్వామికి మూలవర్లకు అర్చకులు రోహిణి అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాదిమంది భక్తులు ఆలయానికి చేరుకుని పుష్కరిణిలో కావళ్లు చెల్లించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దాతలు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీ వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకం చేసి, పుష్పాలతో అందంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్టించారు. స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ తెప్పోత్సవాన్ని తిలకించడానికి భక్తులు రాత్రంతా ఆలయ ప్రాంగణంలో జాగారం చేశారు. వీరి కాలక్షేపం కోసం భక్త మార్కండేయ కథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాలకమండలి చైర్మన్ వెంకటేశ్వర్లు, ఈఓ లత, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.


తెప్పోత్సవంలో శ్రీ వళ్లీదేవసేన సమేత ముత్తుకుమార స్వామి

హుండీ లెక్కింపు

రామగిరి శ్రీవళ్లీదేవసేవ సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ హుండీని ఆడికృత్తిక తెప్పోత్సవాల చివరి రోజు లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణి రాజశయన సమక్షంలో జరిగిన హుండీ లెక్కింపులో టికెట్ల అమ్మకం ద్వారా రూ.2,39,860, హుండీ లెక్కింపు ద్వారా రూ.4,58,446 మొత్తం రూ.6,98,306 ఆదాయం సమకూరినట్లు పాలక మండలి చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆడికృత్తిక తెప్పోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులకు, అధికారులు, సిబ్బందికి చైర్మన్ వెంకటేశ్వర్లు, ఈఓ లత కృతజ్ఞతలు తెలిపారు.


హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఇళ్ల వద్ద చదివించండి


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్‌కుమార్

శ్రీకాళహస్తి: విద్యార్థులను తల్లిదండ్రులు సాయంత్రం పూట చదివించాలని ప్రధానోపాధ్యాయులు నౌజియా సూచించారు. పట్టణంలోని కుమారస్వామి తిప్ప పురపాలకసంఘ పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్ఎం నౌజియా మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని, వారి అభ్యసనా సామర్థ్యంపై ఉపాధ్యాయులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు బుజ్జమ్మ, మహబూబాజాన్, దేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో విద్యాకమిటీ చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

ఏర్పేడు: పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చిన్నతనం నుంచి క్రమ శిక్షణతో తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతినెల పాఠశాలకు వచ్చి తమ పిల్లల చదువుపై ఆరా తీయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, కుమార్ రాజు, ఉమామహేశ్వర్, రామచంద్రయ్య, రాధాకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం టెక్ మహేంద్ర సీఎండీ సీపీ గురునాని, రాజస్థాన్ పరిశ్రమల మంత్రి రాజీవ్ ఆరోరా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బియ్యపు ఆకర్ష్‌రెడ్డి పాల్గొన్నారు.


సీపీ గురునాని, రాజీవ్ ఆరోరాకు జ్ఞాపిక అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

సజ్జ సాగులో మెలకువలు పాటించండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారులు

కేవీబీపురం: రైతులు సజ్జ పంట సాగులో రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి మెలకువలు పాటించి అధికమొత్తంలో దిగుబడులు పొందాలని వ్యవసాయశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. మండలంలోని కళత్తూరు, రాయపేడు, దిగువపుత్తూరు గ్రామాల్లో సజ్జ పంట సాగుపై రైతులకు గురువారం జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న సజ్జపంటను పరిశీలించి రాస్ విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు దివ్య, పద్మజ రైతులకు సాగు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువులు చేసే విధానంపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వేణుగోపాల్, ఎంఏఓ మురళీకృష్ణకుమార్, రైతు భరోసాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట బాలిక బడిలో చేరిక


బాలికను ఎంఆర్‌సీ కార్యాలయానికి తీసుకొచ్చిన ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న మండలంలోని కాంపాళ్లెం గిరిజన కాలనీకి చెందిన బాలిక ఎల్లమ్మను గురువారం ఎంఈఓ రవీంద్రనాథ్ గుర్తించి బీఎన్‌కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 6వ తరగతిలో చేర్పించారు. ఆయన స్వయంగా బాలిక ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వచ్చి స్కూల్‌లో చేర్పించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా స్కూల్‌లో ఉండాలని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్ బుక్స్, బూట్లు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు



పుష్పపల్లకిలో ద్రౌపదీదేవి, వేలాడుతున్న విన్యాసాలు చేస్తున్న యువకులు

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం యువకులు కొక్కీలను గుచ్చుకుని వేలాడుతూ మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్రేన్ల సాయంతో గాలిలో సుమారు 30 అడుగుల ఎత్తులో విన్యాసాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. గురువారం వన్నె కులస్తుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదుల సంఖ్యలో వన్నెకుల యువకులు శరీరాలకు ఇనుప కొక్కీలను గుచ్చుకుని తాళ్ల సాయంతో భారీ క్రేన్లపై వేలాడుతూ పురవీధుల్లో విహరించారు. ఊరేగింపులో చివరిగా ద్రౌపదీదేవి వివిధ రంగుల పుష్పాలతో పుష్పపల్లకిపై మహిళల నుంచి హారతులు అందుకున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి తదితరులు ద్రౌపదీదేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆలయ మర్యాదలతో శాలువలు కప్పి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పిల్లల ఆరోగ్యం కోసమే ఆల్బెండజోల్

- ప్రభుత్వం ఉచితంగా మాత్రలను పంపిణీ చేస్తోంది
- ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ వేసుకోవాలి
- జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్


ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్


సత్యవేడు: గురుకుల పాఠశాలలో..

నారాయణవనం: చిన్నపిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఎంపీపీ దివాకర్‌రెడ్డితో కలిసి మండలంలోని భీమునిచెరువు సచివాలయంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నట్లు అన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం మొత్తం 8,276 మంది విద్యార్థులకు మాత్రలు వేశారు. తప్పిన వారికి 17వ తేదీన అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు, ఎంఈఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, సర్పంచ్ మురుగేశం, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: విద్యార్థుల్లో నులిపురుగులను నివారించడం ద్వారా వారు ఆరోగ్యంగా ఉంటారని, అందుకే ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తోందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం బాలుర గురుకుల పాఠశాలలో 420 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు భోజనం అనంతరం తినిపించారు. కార్యక్రమంలో ఎంఈఓ కే.రవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, దాసుకుప్పం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు మాత్రల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

తొట్టంబేడు మండలంలోని కాసారం పాఠశాలల్లో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు చంద్ర శేఖర్ రెడ్డి, శివ కుమార్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో బాషా, ఏఎన్ఎం దేవి, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో తొట్టంబేడు సచివాలయం-2లో పనిచేసే ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యశోద, కరస్పాండెంట్ డా.సీ. రాజగోపాల్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ

ఏర్పేడు: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారించవచ్చని వైద్యాధికారులు సురేష్‌బాబు, నాగరాజు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఏర్పేడు, పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలన్నింటిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టరు శిల్ప, సీహెచ్‌వో శివరామ్ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ఆల్బెండజోల్ మాత్రలను మింగితే నులిపురుగులు చనిపోతాయని, తద్వారా రక్తహీనత సమస్య ఉండదని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. గురువారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంతో కలసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 6,480 మంది పిల్లలకు వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు నాయకులు, అధికారులు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. గురువారం నాగలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ సింధుశ్యామ్ విద్యార్థులకు మాత్రలు అందజేశారు. మండల పరిధిలో 5822 మందికి మాత్రలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధా చిన్నదొరై, మండల సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు, పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: విద్యార్థులకు నులిపురుగు మాత్రల పంపిణీని ఎంపీపీ రేఖ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గాయత్రి మాట్లాడారు. మండలంలో మొత్తం 5,856 మందికి ఇప్పటికే ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ పూర్తయిందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




శ్రీకాళహస్తి: చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఉపాధ్యాయులు, తొట్టంబేడు: మాత్రలు వేస్తున్న వైద్యులు, ఏర్పేడు: పల్లం ఉన్నత పాఠశాలలో మాత్రల పంపిణీ

ముగిసిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ




పిచ్చాటూరు: నామినేషన్ వేస్తున్న అభ్యర్థి కిరణ్‌కుమార్, సత్యవేడు: నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, వరదయ్యపాళెం: నామినేషన్ వేస్తున్న అభ్యర్థి సెల్వి

పిచ్చాటూరు: మండలంలో ఒక సర్పంచ్, రెండు వార్డు సభ్యుల స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలకు సంబంధించి గురువారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల పర్వం ముగిసిందని రిటర్నింగ్ అధికారి ఏపీ సుబ్బారావు తెలిపారు. అడవి కొడియంబేడు సర్పంచ్ స్థానానికి 3 నామినేషన్లు, గోవర్ధనగిరి 7వ వార్డుకు 4 నామినేషన్లు, అడవిశంకరాపురం 1వ వార్డుకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయినట్లు నాయన వెల్లడించారు. అడవి కొడియంబేడు సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కిరణ్‌కుమార్, టీడీపీ సానుభూతిపరుడు ఎంఎస్ రవి నామినేషన్ దాఖలు చేయగా, మరొక అభ్యర్థి ఎం.రవి నామినేషన్ వేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి కిరణ్‌కుమార్ నామినేషన్ వేయగా, టీడీపీ మద్దతుదారుకు ఆ పార్టీ సత్యవేడు ఇన్‌చార్జ్ హెలన్ విచ్చేశారు.

సత్యవేడులో..

సత్యవేడు: మండలంలోని మూడు పంచాయతీల పరిధిలో మూడు వార్డులు ఎన్నికలకు సంబంధించి ఐదు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి మణిబాబు తెలిపారు. ఇరుగుళం రెండో వార్డుకు బి.వసంత(57), దాసుకుప్పం పంచాయతీలో 3వ వార్డుకు ఎం.రవణమ్మ(40), కృష్ణవేణి(50) నామినేషన్లు వేశారు. మల్లవారిపాళెం ఈస్టు పంచాయతీలో 6 వార్డుకు వెట్టి గిరిజ(48), ఎం.శేఖర్(44) నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ పరిశీలించారు.


బుచ్చినాయుడుకండ్రిగ: కాటూరు వార్డుకు నామినేషన్ వేస్తున్న మునెయ్య

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలో ఉపఎన్నికలు జరగాల్సిన వార్డులకు సంబంధించి చివరిరోజు గురువారం 2 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే 2 వార్డులకు సంబంధించి కేవలం ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో రెండు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు రాచర్ల 2వ వార్డుకు సంబంధించి వి.అనసూయ, ఇందిరా నగర్ పంచాయతీకి సంబంధించి 7వ వార్డుకు మీంజూరు సెల్వి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఇద్దరు ఏకగ్రీవం కానున్నట్లు మండల ఎన్నికల అధికారి వింధ్యాకుమారి తెలిపారు.


ఏర్పేడు : పెనుమల్లం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న సుమతి

బీఎన్‌కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి 7వ వార్డు, వీఎస్‌పురం 3వ వార్డు, జీఎన్‌కండ్రిగ 6వ వార్డు, నెరిణికండ్రిగ 6వ వార్డు, కాటూరు 6వ వార్డు మెంబర్లు గతంలో చనిపోవడంతో ఖాళీ అయ్యాయి. వీటికి సంబంధించి గురువారం 5 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి బాబు తెలిపారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు.

ఏర్పేడు మండలంలో...

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉప ఎన్నికల నామినేషన్ ప్రశాంతంగా ముగిసినట్లు రిటర్నింగ్ అధికారి సురేంద్రనాథ్ తెలిపారు. మండలంలోని పెనుమల్లం సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు, జంగాలపల్లిలో 7వ వార్డు, కందాడులో 6వ వార్డు, మడిబాకలో 3వ వార్డు, పంగూరులో 10వ వార్డుకు ఒక్కో నామినేషన్ దాఖలు అయినట్లు తెలిపారు.

పెన్నలపాడుకు నాలుగు నామినేషన్లు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): పెన్నలపాడు సర్పంచ్ ఉప ఎన్నికలకు గురువారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి రాఘవేంద్రరావు తెలిపారు. పెన్నలపాడు గ్రామానికి చెందిన పి.రేవతి(ఓసీ), పోలూరు మోహనమ్మ(ఓసి), పి.వి జయ(ఓసీ), ఎం.రాజమ్మ(ఎస్సీ) నామినేషన్లు వేశారు. అభ్యర్థుల నామినేషన్లను ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి పరిశీలన ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

12న శుద్ధ తిరుమల - సుందర తిరుమల

తిరుపతి సిటీ: తిరుమల, తిరుపతి రెండు ఘాట్ రోడ్లు, నడకదారుల్లో శనివారం శుద్ధ తిరుమల - సుందర తిరుమల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఆదేశించారు. ఆమె గురువారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో టీటీడీ విద్యాసంస్థల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొంటారని, ఒక్కో సెక్టార్లో 30 మంది చొప్పున 25 సెక్టార్లుగా విభజించామని చెప్పారు. రవాణా, శానిటరీ మెటీరియల్, క్యాటరింగ్, ప్రథమ చికిత్స కిట్లు, చెత్త సేకరణ, రోప్‌లు, వైర్ లెస్ సెట్లు తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని ధర్మరాజులు సమేత ద్రౌపది దేవి ఆలయంలో గురువారం ధ్వజారోహణంతో మహాభారత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, చంద్రగిరికి చెందిన రాజులగారి ఎర్రమరెడ్డి కుమారులు ఉభయ దాతలుగా వ్యవహరించి హరికథా గానాన్ని ప్రారంభించారు. రాత్రి శానంబట్ల మాజీ సర్పంచ్ ముడిపల్లి రాణి సురేష్ రెడ్డి, సర్పంచ్ యశోద శంకర్ యాదవ్ ఉభయ దాతలుగా వెంకటేశ్వర నాట్యకళా మండలి ఆధ్వర్యంలో వేద వ్యాస జననం వీధి నాటకం ప్రదర్శించారు.